# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

బుధవారం | 26 మార్చి 2025 | పేజీలు 8


# డిజిటల్ అరెస్టుల కట్టడికి కేంద్రం చర్యలు తీసుకుంటోంది

- లోక్ సభలో వెల్లడించిన కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్
- ఇప్పటివరకు 7.81 లక్షల సిమ్ కార్డులు డీయాక్టివేట్
- 83 వేల వాట్సాప్ ఖాతాలు నిలిపివేత
- 2,08,469 ఐఎమ్ఈఐలను బ్లాక్ చేసిన ప్రభుత్వం



హైదరాబాద్ పెన్ పవర్:డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారి ఆట కట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఈ మేరకు తీసుకున్న చర్యల్లో భాగంగా ఫిబ్రవరి 7.81 లక్షల సిమ్ కార్డులను, 83 వేల వాట్సాప్ ఖాతాలను నిలిపివేసినట్లు కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ లోక్సభలో వెల్లడించారు. నకిలీ పత్రాలతో సిమ్ కార్డులు పొంది డిజిటల్ మోసాలకు పాల్పడుతున్న వారి ఆగడాలను అరికట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని బండి సంజయ్ తెలిపారు. అంతేకాకుండా, 2,08,469 ఐఎమ్ఈఐలను కూడా ప్రభుత్వం నిలిపివేసిందని అన్నారు.
ప్రతి ఫోన్‌కు కేటాయించే ప్రత్యేక సంఖ్య ఐఎమ్ఈఐ అని, డిజిటల్ అరెస్టుల కోసం వినియోగిస్తున్న 3,962 స్కైప్ ఐడీలను, 83,668 వాట్సాప్ ఖాతాలను భారత సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ గుర్తించి బ్లాక్ చేసిందని వివరించారు. 2021లో సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటైందని, దీని ద్వారా ఇప్పటివరకు 13.36 లక్షలకు పైగా ఫిర్యాదులు అందాయని, సుమారు రూ. 4,386 కోట్లు కాపాడగలిగామని పేర్కొన్నారు.మహిళలు, చిన్నారులే లక్ష్యంగా జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించామని బండి సంజయ్ తెలిపారు. డిజిటల్ నేరాలకు సంబంధించి

-2 లో

## టీజీఎస్ఆర్టీసీ శుభవార్త:

### మీ ఇంటికే భద్రాద్రి రాములోరి కల్యాణ తలంబ్రాలు డెలివరీ

- తలంబ్రాలు ఇంటికి పంపించేందుకు సిద్ధమైన తెలంగాణ ఆర్టీసీ
- ఏప్రిల్ 6వ తేదీన భద్రాద్రిలో రాములోరి కల్యాణం
- రూ.151 చెల్లించి వివరాలు నమోదు చేసుకుంటే ఇంటికే తలంబ్రాలు



హైదరాబాద్ పెన్ పవర్: భక్తులకు శుభవార్త! పవిత్ర భద్రాద్రి సీతారాముల కల్యాణం తలంబ్రాలను మీ ఇంటికే పంపించేందుకు తెలంగాణ ఆర్టీసీ సిద్ధమైంది. ఏప్రిల్ 6వ తేదీన భద్రాద్రిలో రాములవారి కల్యాణం వైభవంగా జరగనుంది. గత ఏడాది కూడా భక్తులకు తలంబ్రాలను ఇంటికి

-2 లో

## చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్...

# కొత్తకుంట చెరువులో మట్టి నింపిన బిల్డర్లపై ఆగ్రహం



- కొత్తకుంట చెరువు, తమ్మిడికుంట, సున్నం చెరువులను పరిశీలించిన రంగనాథ్
- కొత్తకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి నింపుతున్న వంశీరామ్ బిల్డర్స్‌పై ఆగ్రహం
- మూడ్రోజుల్లో మట్టిని తొలగించాలని ఆదేశం

హైదరాబాద్ పెన్ పవర్:హైడ్రా కమిషనర్ రంగనాథ్ హైదరాబాద్ నగరంలోని పలు చెరువులను పరిశీలించారు. ఖాజాగూడలోని కొత్తకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌ను మట్టితో నింపుతున్న వంశీరామ్ బిల్డర్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తకుంట ఎఫ్‌టీఎల్‌లో మట్టిని మూడు రోజుల్లో తొలగించాలని బిల్డర్లను హెచ్చరించారు. మట్టిని తొలగిస్తామని వంశీరామ్ బిల్డర్లు కూడా తెలిపారు.

-2లో

# అధిష్ఠానం ఏ బాధ్యతలు అప్పగించినా నెరవేరుస్తాం

- మంత్రి పదవిపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- మంత్రి పదవి వస్తుందనే ఆశాభావంతో ఉన్నానని రాజగోపాల్ రెడ్డి వెల్లడి
- హెూంమంత్రిత్వ శాఖ అంటే ఆసక్తి అన్న రాజగోపాల్ రెడ్డి



హైదరాబాద్ పెన్ పవర్:కాంగ్రెస్ పార్టీ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిపై కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ, హెూంమంత్రిత్వ శాఖ అంటే తనకు ఆసక్తి ఉన్నప్పటికీ, అధిష్ఠానం ఏ బాధ్యతలు అప్పగించినా సమర్థవంతంగా నిర్వహిస్తానని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలబడతానని అన్నారు. ప్రస్తుతానికి తనకు ఢిల్లీ నుండి ఎలాంటి సమాచారం అందలేదని వెల్లడించారు. ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

-2 లో



# సమస్య ఏదైనా ఆత్మహత్య పరిష్కారం కాదు

- బెట్టింగ్ యాప్‌ల వ్యవహారంపై స్పందించిన వీసీ సజ్జనార్
- బెట్టింగ్ యాప్ బాధితులకు సజ్జనార్ విజ్ఞప్తి
- సమస్య ఏదైనా ఆత్మహత్య పరిష్కారం కాదన్న వీసీ సజ్జనార్
- బలవన్మరణం వద్దు... బతికి సాధించడమే ముద్దు అన్న సజ్జనార్
- సమస్య నుంచి ఎలా బయటపడాలో ఆలోచించాలని సూచన
- చనిపోవాలనే ఆలోచన రాకూడదన్న సజ్జనార్

హైదరాబాద్ పెన్ పవర్:బెట్టింగ్ యాప్‌ల వ్యవహారంపై టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ స్పందించారు. బెట్టింగ్ యాప్‌ల బాధితులకు ఆయన ఒక విజ్ఞప్తి చేశారు. సమస్య ఏదైనా ఆత్మహత్య పరిష్కారం కాదని ఆయన అన్నారు. 'బలవన్మరణం వద్దు... బతికి సాధించడమే ముద్దు' అని బెట్టింగ్ యాప్‌ల

-2 లో

## చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్... కొత్తకుంట చెరువులో మట్టి నింపిన బిల్డర్లపై ఆగ్రహం

- మొదటి పేజీ తరువాయి

కొత్తకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితిని కమిషనర్ పరిశీలించారు. ఇదే విషయమై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కూడా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని తెలుసుకోవడానికి జాయింట్ ఇన్స్పెక్షన్ చేయాలని అన్నారు. ఆ తర్వాత మాదాపూర్‌లోని తమ్మిడికుంట, బోరబండ సమీపంలోని సున్నం చెరువును సందర్శించారు. ఈ రెండు చెరువుల్లో పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. చెరువుల చుట్టూ తిరిగి, సుందరీకరణ, పచ్చదనం పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. హైడ్రా ఈ ఏడాది చేపట్టిన ఆరు చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి, సుందరీకరణ పనులు వచ్చే వర్షాకాలానికి పూర్తి కావాలని, పనుల్లో ఎక్కడా జాప్యం, అలసత్వం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

## డిజిటల్ అరెస్టుల కట్టడికి కేంద్రం చర్యలు తీసుకుంటోంది

- మొదటి పేజీ తరువాయి

ఫిర్యాదు చేయడానికి సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (https://cybercrime.gov.in) అందుబాటులో ఉందని, దీని ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారని, సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని అధికారులు చర్యలు చేపడతారని వివరించారు.

## అధిష్టానం ఏ బాధ్యతలు అప్పగించినా నెరవేరుస్తాం

- మొదటి పేజీ తరువాయి

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరులు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలతో సమావేశమయ్యారు. మంత్రి వర్గ విస్తరణతో సహా పలు అంశాలపై వారు చర్చించారు. వివిధ సామాజిక వర్గాల నుంచి నలుగురు లేదా ఐదుగురికి రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో స్థానం లభించే అవకాశం ఉందని సమాచారం.

### టీజీఎస్ఆర్టీసీ శుభవార్త:

## మీ ఇంటికే భద్రాద్రి రాములోరి కల్యాణ తలంబ్రాలు డెలివరీ

- మొదటి పేజీ తరువాయి

చేరవేసింది. దేవాదాయ శాఖ సహకారంతో స్వామివారి కల్యాణ తలంబ్రాలను ఈసారి కూడా భక్తుల ఇళ్ల వద్దకు చేర్చే కార్యక్రమానికి టీజీఎస్ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. శ్రీ సీతారాముల వారి కల్యాణం తలంబ్రాలు కావాలసిన భక్తులు టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాల్లో రూ. 151 చెల్లించి వివరాలను నమోదు చేసుకోవాలి. కల్యాణం అనంతరం తలంబ్రాలను భక్తులకు ఇంటికి పంపిస్తారు. ఆర్టీసీ లాజిస్టిక్స్ వెబ్‌సైట్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. కాల్ సెంటర్ నెంబర్లు 040-69440069, 040-69440000 లను సంప్రదిస్తే టీజీఎస్ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు ఆర్డర్లను స్వీకరిస్తారని ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు.

# సమస్య ఏదైనా ఆత్మహత్య పరిష్కారం కాదు

- మొదటి పేజీ తరువాయి

బాధితులకు సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ బాధితులు బలవన్మరణాలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. "ఆలోచించండి.. మీరు క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాల వల్ల మీ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంతటి క్షోభను అనుభవిస్తారో. సమస్య వచ్చినప్పుడు దాని నుంచి ఎలా బయటపడాలో అన్వేషించాలే తప్ప.. చనిపోవాలనే ఆలోచనే రాకూడదు" అని సూచించారు. మనకు ఉన్నది ఒక్కటే జీవితమని, ఏం సాధించినా ఈ జీవితంలోనే అని పేర్కొన్నారు. జీవన ప్రయాణంలో ఒక్కసారి కిందపడితే సర్వం కోల్పోయినట్లుగా భావించవద్దని హితవు పలికారు. అమూల్యమైన జీవితాన్ని అర్ధాంతరంగా కాలదన్నుకోవద్దని విజ్ఞప్తి చేశారు. చీకటి వెలుగుల వలె నిత్యం కష్టసుఖాలు అందర్నీ వెంటాడుతూనే ఉంటాయని, కష్టకాలంలో బాధలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు. తద్వారా పరిష్కార మార్గాలు వెతకాలని ఆయన అన్నారు. ఎంత కష్టం వచ్చినా ఎల్లకాలం ఉంటుందా? చనిపోయినంత మాత్రాన సమస్యలు టక్కున మాయమవుతాయా!? అని ప్రశ్నించారు.

# డీలిమిటేషన్ తో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుంది

హైదరాబాద్ పెన్ పవర్: డీలిమిటేషన్ పై స్పందించిన తెలంగాణ సీనియర్ కాంగ్రెస్ నేత వీహెచ్‌డీలిమిటేషన్ ను వ్యతిరేకిస్తున్న దక్షిణాది రాష్ట్రాలు.అన్ని రాజకీయ పక్షాలు డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా సంఘీభావం ప్రకటించాలన్న వీహెచ్‌ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో నియోజకవర్గాల పునర్విభజన డీలిమిటేషన్ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న డీలిమిటేషన్‌ను దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో ఇటీవల చెన్నైలో వివిధ రాజకీయ పక్షాలతో అఖిలపక్ష సమావేశం కూడా జరిగింది. డీలిమిటేషన్‌ను మరో 25 ఏళ్ల స్తంభింపజేయాలని దక్షిణాది రాష్ట్రాల నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేస్తే ఉత్తరాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్య గణనీయంగా పెరిగి, దక్షిణాది రాష్ట్రాల్లో తగ్గే ప్రమాదం ఉందని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన కాకుండా ఎవరికీ నష్టం జరగని రీతిలో శాస్త్రీయ విధానం కనుగొనే వరకు డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై తాజాగా తెలంగాణకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ పీసీసీ అధ్యక్షుడు వి. హనుమంతరావు స్పందించారు. దేశంలో జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం నిర్వహించబోయే డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పక్షాలు సంఘీభావం ప్రకటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి ఫలితం

**హుస్నాబాద్ కి శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజి మంజూరు చేస్తూ జీవో నెంబర్ 18 ద్వారా తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు**



హైదరాబాద్ పెన్ పవర్: పెద్దపల్లి సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి మేరకు శాతవాహన యూనివర్సిటీ కి హుస్నాబాద్ లో ఇంజనీరింగ్ కాలేజి, యూనివర్సిటీ కి లా కాలేజి మంజూరు. శాతవాహన యూనివర్సిటీ కి ఇంజనీరింగ్ కాలేజి,లా కాలేజి మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్.

హుస్నాబాద్ కు శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజి మంజూరు కావడం పట్ల హుస్నాబాద్ ప్రజల హర్షం.

హుస్నాబాద్ కి శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజి తీసుకొచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపిన హుస్నాబాద్ ప్రజలు. శాతవాహన విశ్వవిద్యాలయం 2025-2026 విద్యా సంవత్సరం నుండి హుస్నాబాద్‌లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ స్థాపనకు అడ్మినిస్ట్రేటివ్ అనుమతి ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి. ః. ఎవఇఘ్న ఆుఇ- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 3 ః.ఎవఇఘ్న- ఎ మరియు 4 ః.ఎవఇఘ్న -ఇఆఇ ప్రతి ప్రోగ్రామ్‌లో 60 మంది విద్యార్థులను తీసుకుంటారు. హుస్నాబాద్‌లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ శాతవాహన యూనివర్సిటీ నిర్మాణానికి రూ.44.12 కోట్ల రూపాయలు మంజూరు.

# రూ.100 కోట్ల చిట్టీల సొమ్ముతో పరారైన పుల్లయ్య బెంగళూరులో అరెస్ట్

- చిట్టీల పేరిట రూ.100 కోట్లకు టోకరా వేసిన పుల్లయ్య
- హైదరాబాదులో ఇల్లు ఖాళీ చేసి పరారీ
- దాదాపు 2 వేల మంది నుంచి చిట్టీలు వసూలు
- సీసీఎస్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన బాధితులు



**హైదరాబాద్ పెన్ పవర్:**గత నెలలో హైదరాబాదులో పుల్లయ్య అనే వ్యక్తి రూ.100 కోట్ల మేర చిట్టీల సొమ్ము వసూలు చేసి పరారైన సంగతి సంచలనం సృష్టించింది. దాదాపు 2 వేల మంది నుంచి అతడు చిట్టీల పేరుతో నగదు వసూలు చేసి, తిరిగి చెల్లించకుండా పారిపోవడంతో బాధితులు లబోదిబోమన్నారు. అతడిపై హైదరాబాద్ సీసీఎస్ పోలీస్ స్టేషన్ లో బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు... ఎట్టకేలకు చిట్టీల పుల్లయ్యను బెంగళూరులో అరెస్ట్ చేశారు. అతడితోపాటు రామాంజనేయులు అనే వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరినీ బెంగళూరు నుంచి హైదరాబాద్ తరలించారు.

పుల్లయ్య స్వస్థలం అనంతపురం జిల్లా చందన లక్ష్మీపల్లి గ్రామం. హైదరాబాదులోని ఎస్సార్ నగర్ లో చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు చిట్టీలు నిర్వహిస్తుంటాడు. మొదట్లో చెల్లింపులు సక్రమంగా జరపడంతో ఖాతాదారులు మరింత పెరిగారు. ఇదే అదనుగా, అందినకాడికి వసూలు చేసుకుని ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడు. 18 ఏళ్ల క్రితం నగరానికి వచ్చిన అతడు మొదట్లో అడ్డ మీద కూలీగా పనిచేశాడు. స్థానికులతో పరిచయాలు పెంచుకుని క్రమంగా చిట్టీల వ్యాపారంలో దిగాడు.

# జస్టిస్ వర్మ ఇంటికి విచారణ కమిటీ.. సమ్మెలో అలహాబాద్ బార్ అసోసియేషన్



**హైదరాబాద్ పెన్ పవర్:**ఢిల్లీ హైకోర్టు జడ్జి ఇంట్లో నగదు వివాదం కేసులో విచారణ వేగవంతం చేశారు. ఈ వివాదంపై సుప్రీంకోర్టు నియమించిన ముగ్గురు సభ్యుల అంతర్గత కమిటీ విచారణ ప్రారంభించింది. జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలపై అంతర్గత విచారణ జరిపేందుకు సీజేఐ సంజీవ్ ఖన్నా మార్చి 22న ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. మంగళవారం (మార్చి 25) ఈ ప్యానెల్ సభ్యులు ఢిల్లీలోని 30, తుగ్లక్ క్రెసెంట్‌లోని జస్టిస్ వర్మ ఇంటిని పరిశీలించారు. కమిటీ సభ్యులు జస్టిస్ వర్మ నివాసంలో దాదాపు అరగంట సేపు పరిశీలించారు. ఈ కమిటీలో పంజాబ్ హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ షీల్ నాగు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జీఎస్ సంధవాలియా,కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్ లు ఉన్నారు. మార్చి 14న రాత్రి ఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలార్పారు. అయితే అగ్ని ప్రమాదం తర్వాత నగదు బయపడినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాటికి సంబం ధించిన వీడియోలను స్వయంగా సుప్రీంకోర్టు విడుదల చేసింది. ఈ ఘటన తర్వాత జస్టిస్ వర్మను 2021లో అలహాబాద్ హైకోర్టుకు తిరిగి పంపించాలని కేంద్రాన్ని సిఫార్సు చేస్తూ నేతృత్వం లోని సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం తీర్మానాన్ని జారీ చేసింది.సుప్రీంకోర్టు ఆదేశాలు మేరకు జస్టిస్ యశ్వంత్ వర్మ న్యాయపరమైన పని చేయకూడదని ఢిల్లీ హైకోర్టు ప్రకటించింది.మరోవైపు నగదు వివాదంలోని ఆరోపణలను జస్టిస్ వర్మ తీవ్రంగా ఖండించారు. తాను గానీ కుటుంబ సభ్యులు గానీ ఎవరూ అధికారిక నివాసం స్టోర్‌రూమ్‌లో ఎప్పుడూ నగదు ఉంచలేదని అన్నారు. నగదు దొరికిందనే ఆరోపణ అప్రతిష్టపాలు చేయడానికి కుట్రగా కనిపిస్తోందని అన్నారు.అయితే జస్టిస్ వర్మను బదిలీ చేయడాన్ని అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ వ్యతిరేకించింది. సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం అలహాబాద్ హైకోర్టును చెత్త కుప్ప అనే ప్రశ్నను లేవనెత్తుతుందని బార్ బాడీ తీవ్ర పదజాలంతో ఓ ప్రకటన విడుదల చేసింది.

## బాలానగర్ లో హిట్ అండ్ రన్.

**హైదరాబాద్ పెన్ పవర్:** బాలానగర్ లో కారును మద్యం మత్తులో నడిపించి కీర్తి (19)అనే యువతిని ఢీ కొట్టిన ఘటన జరిగింది. బాలా నగర్ పోలీస్ స్టేషన్ పరిధి ఐడిపిఎల్ చౌరస్తా లో మద్యం మత్తులో (ఫార్చునర్) కారు ను డ్రైవ్ చేస్తూ యువతి ని ఢీ కొట్టాడు. ఆక్సిడెంట్ చేసి కారును ఆపకుండా అతివేగంతో వెళ్లిపోయాడు. సిగ్నల్ వద్ద గల ట్రాఫిక్ పోలీసులు అలెర్ట్ అయ్యారు. ఫతే నగర్ సిగ్నల్ లో కారును ఆపి డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు. మద్యం మత్తులో ఆక్సిడెంట్ చేసిన వ్యక్తి బల్కం పెట్ కు చెందిన గొగం అనిల్(35)గా గుర్తించారు. యువతి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాలా నగర్ పోలీసులు కేసు నమోదు చేసారు.

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం...

**హైదరాబాద్ పెన్ పవర్:**హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత పై ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో గిరిజన సంఘాల ప్రతినిధులు సుధీర్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు.ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలి అశోక్ రాథోడ్,

సుధీర్ రెడ్డి రాజకీయంగా పనికిరాడు అని అసలు ఎమ్మెల్యే పదవికి అనర్హుడు అని గిరిజన ఆదివాసి నాయకుడు అశోక్ రాథోడ్ అన్నారు.ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆమెపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసనగా ఐస్ సదన్ డివిజన్ చంపాపేట్ ప్రధాన రోడ్ పై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దిష్టిబొమ్మ దానం చేశారు, అనంతరం గిరిజన నాయకులు మాట్లాడుతూ ఒక బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా ఉండి మహిళలను అగౌరపరిచే విధంగా మాట్లాడడం సుధీర్ రెడ్డికి సరికాదని ఆయన అన్నారు. సుధీర్ రెడ్డి ఎమ్మెల్యే పదవికి అనర్హుడ అని అన్నారు.తను చేసిన వ్యాఖ్యలకు నైతికంగా బాధ్యత వహించి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చట్టపరంగా అతనిపై చర్యలు తప్పవని కఠినమైన శిక్ష పడే వరకు మేము పోరాడుతూనే ఉంటామన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ జిల్లాలో రాజీవ్ రహదారిపై ఆశా వర్కర్లు ధర్నా...
## ఫిక్స్డ్ వేతనం 18వేలు చెల్లించాలని డిమాండ్

**హైదరాబాద్ పెన్ పవర్:**కరీంనగర్ జిల్లాలో ఆశ వర్కర్లు రోడ్డెక్కారు. ఫిక్స్డ్ వేతనం 18 వేలు చెల్లించాలని ధర్నా రాస్తారోకో చేశారు. గత కొద్దిరోజులుగా నిరసన ఆందోళన చేస్తున్న ఆశ వర్కర్లు తిమ్మాపూర్ మండల కేంద్రంలో రాజీవ్ రహదారిపై ధర్నా రాస్తారోకో చేశారు. గత నాలుగు రోజులుగా ధర్నా చేస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిక్స్డ్ వేతనం 18 వేలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## హైదరాబాద్ లో అక్రమ నిర్మాణాలపై జిహెచ్ఎంసి కొరడా

**హైదరాబాద్ పెన్ పవర్:** రాజేంద్రనగర్ నలంద నగర్ అనుమతులేని నిర్మాణాలను జీహెచ్ఎంసి కూల్చివేసింది. ఎన్ని సార్లు నోటీసులు జారీ చేసినా బిల్డింగ్ యజమాని పట్టించుకోలేదు. దాంతో భారీ పోలీసు బందోబస్తు మధ్య బిల్డింగ్ స్లాబ్ లను జీహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. పర్మిషన్ కు మించి బిల్డర్ రెండు అంతస్తులు అదనంగా వేసాడు. అదనంగా వేసిన ఐదవ, ఆరవ ఫ్లోర్ స్లాబ్లను జీహెచ్ఎంసి అధికారులు తొలగించారు.

## వివేక్ అన్న.. కంగ్రాట్స్..! శుభాకాంక్షలు చెప్పిన మల్లారెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** అసెంబ్లీ లాబీలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. మాజీ మంత్రి మల్లా రెడ్డి చెన్నూరు శాసన సభ్యుడు వివేక్ వెంకట స్వామికి ఎదురు పడ్డారు..' వివేక్ అన్న కంగ్రా ట్స్.. మంత్రి పదవి వస్తుంది అని తెలిసింది.. అంటూ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. పక్కనే ఉన్న మక్తల్ ఎమ్మెల్యే వాకాటి శ్రీహరికి కూడా కంగ్రాట్స్ అంటూ ఆలింగనం చే సుకున్నాడు. ఈ సందర్భంగా.. దేశంలో 3 యూనివర్సిటీలు నా ఒక్కనికే ఉన్నాయి. నేను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను. నా ఏజ్ కూడా అయింది. నా జీవితానికి ఇది చాలు. ఎంపీ అయినా, ఎమ్మెల్యే అయినా, మంత్రి అయినా మా ఇంట్లో టికెట్?ల కోసం చాలా మంది ఉన్నారు' అంటూ నవ్వులు పూయిస్తూ వెళ్లిపోయారు.

## అవనిగడ్డ లో డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన

**హైదరాబాద్ పెన్ పవర్:** అవనిగడ్డలో డీఎస్సీ అభ్యర్థులు అందోళనకు దిగారు. మెగా డీఎస్సీ ని వెంటనే విడుదల చేయాలని నిరుద్యోగుల డిమాండ్ చేసారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ డీఎస్సీని ప్రకటించాలని రోడ్డుపై బైఠాయించారు. వందలాదిగా రోడ్డుపై బైటాయించి డిఎస్సీ నిరుద్యోగులు నిరసన తెలిపారు. సీఎం చంద్రబాబుఎన్నికల సమయంలో డీఎస్సీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేసారు. అవనిగడ్డలో రాజీవ్ చౌక్ వద్ద ధర్నా మానవహారం, అనంతరం ప్రదాన రహదారి వెంట భారీ ర్యాలీ నిర్వహించారుద. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించిన పవన్ కళ్యాణ్ గొంతుక అధికారంలోకి రాగానే మూగ పోయిందంటూ నినాదాలు చేసారు ఈ నేపథ్యంలో అవనిగడ్డలో కిలోమీటర్ మేర భారీగా ట్రాఫిక్ స్థంభించింది.

## క్యాన్సర్ బాధితుడి మాటలకు మంత్రి శ్రీధర్ బాబు కన్నీళ్లు!

**హైదరాబాద్ పెన్ పవర్:**'సార్, నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. పెద్ద క్రికెటర్ కావాలని కలగన్నా.. నాకో క్రికెట్ కిట్ ఇప్పించండి సార్" క్యాన్సర్ తో పోరాడుతున్న ఓ యువకుడి మాటలివి. వింటే మనసున్న ప్రతీ మనిషికీ గుండె చెమర్చక మానదు. ఈ మాటలకే మంత్రి శ్రీధర్ బాబు ఏకంగా కన్నీళు పెట్టుకున్నారు. భూపాలపల్లి జిల్లా పాలిమల మండలం సర్వాయ్ పేట గ్రామానికి చెందిన భౌత్ నితిన్ కాన్సర్ తో బాధపడుతూ... ఖాజాగూడలోని లోని స్పర్శ్ హాస్పీస్ లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా ఆసుపత్రికెళ్లి పరామర్శించారు. నేనున్నానని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా నితిన్ మాటలకు కన్నీళ్లు పెట్టుకున్న శ్రీధర్ బాబు.. అప్పటికప్పుడు క్రికెట్ కిట్ తెప్పించి అతని కోరికను నెరవేర్చారు. సొంతన్నగా వెంట నిలుస్తానని, ఏ అవసరమున్నా నేరుగా నన్ను సంప్రదించండి అంటూ నితిన్ తల్లిదండ్రులకు మంత్రి ధైర్యం చెప్పారు.

# ఆర్ఓబి నిర్మాణంలో అడ్డంకులు ఆదిగమించడానికి చర్యలు:



**హైదరాబాద్ పెన్ పవర్:** గుడివాడలో ఆర్ఓబి నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలో చర్యలు తీసుకుంటున్నామని....పూర్తి స్థాయిలో పట్టణంలోని రోడ్ల అభివృద్ధికి సన్నాహాలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ పట్టణం రాజేంద్రనగర్ లోని తన స్వగృహంలో జాతీయ రహదారుల అథారిటీ అధికారులతో....ఆర్ఓబి నిర్మాణ పనులపై ఎమ్మెల్యే రాము రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడివాడ పట్టణంలోనీ ప్రధాన రహదారుల అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే రాము సమీక్షించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల పురోగతిని అధికారులు ఎమ్మెల్యే రాముకు వివరించారు.

అనంతరం ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడారు.... గుడివాడ పట్టణంలో జరుగుతున్న రైల్వే గేట్లపై నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. రైల్వే గేట్ల పై ప్రాంతంలో... ఆ శాఖ అనుమతులు రాకపోవడంతో నిర్మాణ పనులు ఇప్పటివరకు ప్రారంభం కాలేదన్నారు. రైల్వే శాఖ నుండి సాంకేతిక అనుమతులు వచ్చాయని, ఇతర అనుమతులు మంజూరుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రధానంగా గేట్ల పై బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలు పెట్టిన తర్వాత.... అత్యధిక రోజులు గేట్లు మూయాల్సి వస్తుందని, గేట్ల మూసి ఉంచే రోజులను తగ్గించడమే కాక, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా చివరి దశకు చేరుకున్న 216 జాతీయ రహదారిని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అండర్ పాస్ నిర్మాణ పనులు కూడా త్వరగతిన జరిగేలా కృషి చేస్తున్నామని... ఆర్ఓబి నిర్మాణం పూర్తి కావడానికి ఉన్న అడ్డంకులను ఒక్కొక్కటిగా అధిగమిస్తూ వేగవంతంగా నిర్మాణ పనులు జరిగేలా అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నట్లు ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.

అదేవిధంగా గుడివాడ బస్టాండ్ సెంటర్ నుండి వాసవి చౌక్, మార్కెట్ సెంటర్, బంటుమిల్లి రోడ్డు మీదుగా బైపాస్ రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్ పై.... టైయిలింగ్ ఏర్పాటు పనులు, ఐఎంఎ రహదారి అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారుల ఎండ్ టూ ఎండ్ విస్తరణ, రహదారుల వెంబడి డ్రైనేజీల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు అతి త్వరలో అనుమతులు రానున్నాయని ఎమ్మెల్యే రాము చెప్పారు. ఢిల్లీ వరకు వెల్లైనా సరే అభివృద్ధి పనులకు నిధులు సాధించేలా ఎంపీ వల్లభనేని బాలసౌరీతో కలిసి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు.

ఈ సమావేశంలో నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సంజీవ రాయుడు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి. శరత్ చంద్ర, ప్రాజెక్టు మేనేజర్ ఎన్. శ్రీనివాస్, టీం లీడర్ దివాకర్, రెసిడెన్ట్ ఇంజనీర్ బి. నిరంజన్ రావు,వల్లభనేని కన్స్టక్షన్స్ ఎండి వి. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలి:




**హైదరాబాద్ పెన్ పవర్:**'కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు సమకూర్చాలి. రైతులకు అవగాహన కల్పించాలి. యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కొనుగోలు కమిటీ సభ్యులను కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జిల్లా కొనుగోళ్ల కమిటీ సభ్యులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ధాన్యం పూర్తిగా పరిపక్వతకు వచ్చిన తర్వాతనే హార్వెస్ట్ చేసేలా రైతులకు, హార్వెస్టింగ్ మిషన్ ఆపరేటర్లకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం కోతలకు సంబంధించి రెవెన్యూ గ్రామాల వారీగా నిర్దిష్ట ప్రణాళిక ఏర్పాటు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకపు యంత్రాలు, తేమను కొలిచే యంత్రాలు, గన్ని సంచులు, తార్పాలీన్ కవర్లు వంటివి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పుడు ఉన్న ప్యాడి క్లీనర్ లతో పాటు మరో 15 ప్యాడి క్లీనర్ లను కొనుగోలు చేయాలని సూచించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ధాన్యం కొనుగోలు తర్వాత వెన్ వెంటనే వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. రైతుకు సకాలంలో సొమ్ము అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకాల ధాన్యాలు వేరువేరు ప్రదేశాల్లో ఉండేలా చూడాలని సూచించారు. ఎండాకాలం దృశ్య రైతులకు నీడ, తాగునీటి సౌకర్యం ఉండేలా చూడాలని తెలిపారు. సిబ్బంది కొనుగోలు రిజిస్టర్ ను అందుబాటులో ఉంచుకోవాలని, పకడ్బందీగా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. తేమ యంత్రాన్ని నీడలోనే ఉండేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పరిక్షా విధానం పై పూర్తిగా అవగాహన తెచ్చుకో ప్రిపరేషన్ ప్రారంభించాలి:



హైదరాబాద్ పెన్ పవర్:ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేట లోని తెలంగాణ స్కిల్ మరియు నాలెడ్జ్ సెంటర్ మరియు కెరీర్ అండ్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి ముఖ్య అతిధిగా పాల్గొని సివిల్ సర్వీస్ ప్రిలిమినరి పరీక్ష, మెయిన్స్ పరీక్షలలో ఉండే పేపర్లు మార్కుల విధానము, ఇంటర్వ్యూ కు ఎలా సిద్ధం అవ్వాలి, రిఫరెన్స్ పుస్తకాలుగా ఏమి ఉపయోగపడతాయి, నోట్స్ తయారు చేసుకునే విధానం గురించి సుమారు రెండు గంటలపాటు సమగ్రంగా వివరించారు. పట్టుదల, స్పష్టమైన లక్ష్యం, నిర్దిష్టమైన ప్రణాళికతో కృషి చేస్తే సివిల్ సర్వీసెస్ పరీక్షలు సులభంగా పాస్ కావచ్చు అని అన్నారు. డిగ్రీ తర్వాత విద్యార్థులకు ఎలాంటి కెరీర్ ఎంచుకోవాలో కొంత గందరగోళంగా ఉంటదని ఇప్పుడే స్పష్టమైన ఆలోచనతో కెరీర్ ప్లాన్ చేసుకోవాలన్నారు. యూపిఎస్సి సివిల్ సర్వీస్ పరీక్షలకు కు సిద్ధం అవలేకునేవారు. ప్రిలిమ్స్, మెయిన్స్ మరియు ఇంటర్వ్యూ 3 స్టేజ్ లకు ప్రిపేర్ కావాలన్నారు. పరిక్షా విధానం పై పూర్తిగా అవగాహన తెచ్చుకో ప్రిపరేషన్ ప్రారంభించాలన్నారు. వీలైతే కోచింగ్ తీసుకోవడం లేకపోతే సొంతగా ప్రిపేర్ కావాలన్నారు. బట్టీ పద్ధతిలో కాకుండా విషయ పరిజ్ఞానం పెంచుకొని దానిని పరీక్షలలో ఎలా రాయాలో ప్రాక్టీస్ చేయాలన్నారు. సబ్జెక్ట్ పరిజ్ఞానం, భాష పైన పట్టు తెచ్చుకుంటే తెలుగులో నైన మెయిన్స్ మరియు ఇంటర్వ్యూ లో రాణించవచ్చని అన్నారు. ప్రతీ రోజు వార్త పత్రికలు చదువాలని, సోషల్ మీడియా కు దూరంగా ఉండాలని, తప్పులు లేకుండా అక్షరాలను స్పష్టంగా రాయడం ప్రాక్టీస్ చెయ్యాలని, ఇప్పటికే విజయం సాధించిన వారి సక్సెస్ స్టోరీస్ చదువాలని, ప్రామాణిక పుస్తకాలను చదువాలని అన్నారు. స్వయంగా తాను సివిల్స్ పరీక్షకు ఎలా ప్రిపేరై మొదటిసారే ఎలా విజయం సాధించింది విద్యార్థులను ఆకట్టుకునేలా వివరించి వారిలో స్ఫూర్తిని నింపారు. అలాగే డిగ్రీ కాలేజ్ విద్యార్థుల కొరకు సివిల్ సర్వీస్ ప్రిపేర్ అవడానికి అవసరమైన బుక్స్ ను అందిస్తానని తెలిపారు. అనంతరం విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. డిగ్రీ విద్యార్థుల కోసం అమూల్యమైన సమయాన్ని కేటాయించి సివిల్ సర్వీసెస్ పై అవగాహన కల్పించినందుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి సునీత మరియు అధ్యాపకులు జిల్లా కలెక్టర్ ను శాలువాతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో కెరీర్ అండ్ గైడెన్స్ సెల్ మరియు టీ.ఎస్.కే.సి కోఆర్డినేటర్ డాక్టర్ జె. ఉమామహేశ్వరి , కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.అయోధ్య రెడ్డి, డాక్టర్ గోపాల సుదర్శనం, డాక్టర్ సి.హెచ్ మధుసూదన్, పరిపాలన అధికారి సులేమాన్, పిట్ల దాసు, డా.లీలావతి, మహేష్ తో పాటు అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# చంద్రబాబు నాయుడు దృష్టికి అరకు నియోజకవర్గ సమస్యలు



హైదరాబాద్ పెన్ పవర్:అరకులోయ అమరావతి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలిసి అరకులోయ నియోజకవర్గ సమస్యలను వివరించి వినతిపత్రం సమర్పించిన అరకులోయ నియోజకవర్గం ఇన్చార్జ్ సియ్యారి దొన్ను దొర అరకులోయ నియోజకవర్గం పరిధిలో మౌలిక సదుపాయాలు రోడ్డు, మంచినీరు విద్య, వైద్యం పై ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు విడుదల చేయాలని సీఎంకు కోరిన దొన్నుదొర అరకులోయ నియోజకవర్గ పరిధిలో మారుమూల గ్రామాలలో నేటి వరకు రోడ్డు సౌకర్యం లేక గిరి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కొండ వాగు ప్రాంతంలో రోడ్డు వేయుటకు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అడ్డుకుంటున్నారని దీని ద్వారా అమాయక గిరిజన ప్రజలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నారని తెలిపారు. మారుమూల గిరి గ్రామాలలో నేటి వరకు పాఠశాల భవనాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని నూతన పాఠశాల భవనాలు మంజూరు చేయాలని కోరారు. పర్యటక ప్రాంతమైన అరకులోయను అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రత్యేకంగా నిధులు ఏర్పాటు చేయాలని ప్రపంచ ఖ్యాతిగాంచిన అరకు కాఫీ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ అరకులో ఏర్పాటు చేయాలని తద్వారా నిరుద్యోగ గిరి యువతకు ఉపాధి లభించే విధంగా చూడాలని సీఎం చంద్రబాబు నాయుడు దొర ప్రత్యేకంగా విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెదబయలు మాజీ ఎంపీపీ వెచ్చంగి కొండయ్య పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసు బాబు పద్మపురం మాజీ సర్పంచ్ మహదేవ్ సీనియర్ నాయకులు చిన్ని వెంకటరావు తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు.

# జస్టిస్ వర్మ ఇంట్లో నగదు రికవరీ అంశంపై చర్చ

**అఖిలపక్ష సమావేశానికి రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ పిలుపు**



హైదరాబాద్ పెన్ పవర్:'హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీ స్థాయిలో నగదు బయటపడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. దీనిపై ప్రతిపక్ష నాయకులు తీవ్రంగా స్పందించారు. ఈ వ్యవహారంపై నిష్పాక్షికంగా దర్యాప్తు జరగాలని కొందరు డిమాండు చేయగా జస్టిస్ వర్మను అభిశంసించాలని మరికొందరు సూచించారు. ఇది చాలా పెద్ద విషయమని, న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతిన్నదని ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ సోమవారం అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో వర్మ ఇంట్లో నగదు రికవరీ అంశంపై చర్చించేందుకు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు.ఈ వ్యవహారం తీవ్రమైనదిగా చైర్మన్ అభివర్ణించారు. ఈ అంశంపై సభలో అధికార, ప్రతిపక్ష నాయకులతో చర్చలు జరిపినట్లు చెప్పారు. వారి సూచనల మేరకు అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. 'జస్టిస్ వర్మ విషయంపై చర్చించేందుకు ఈరోజు సాయంత్రం 4:30 గంటలకు అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశాను' అని మంగళవారం రాజ్యసభలో చైర్మన్ అన్నారు. ఈ సమస్య చాలా తీవ్రమైనదని, ఈ అంశంపై ఫ్లోర్ లీడర్లతో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు ఏప్రిల్ 2 కు వాయిదా

న్యూఢిల్లీ బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు ఏప్రిల్ 2 కు వాయిదా పడింది. మంగళవారం నాడు సుప్రీంకోర్టులో బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసు విచారణ జరిగింది. బిఆర్ఎస్ తరపు వాదనలు ముగిసాయి. స్పీకర్, అసెంబ్లీ సెక్రటరీ తరపు న్యాయవాదులు ఏప్రిల్ 2న వాదనలు వినిపించనున్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో నేత కార్మికుడు రాజు ఆత్మహత్య...

**ఆర్థిక ఇబ్బందులు అప్పులే కారణం అంటున్న కుటుంబ సభ్యులు**

**రాజన్న సిరిసిల్ల:** తంగళ్ళపల్లి ఇందిరమ్మ కాలనీలో నేత కార్మికుడు పర్రిపల్లి రాజు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు అప్పుల బాధలే కారణమని కుటుంబ సభ్యులు పోలీసులకు పిర్యాదు చేశారు. నేత కార్మికుడు రాజు గతరాత్రి బాత్ రూమ్ క్లీన్ చేసే యాసిడ్ సేవించడంతో కుటుంబ సభ్యులు వెంటనే సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు ప్రాణాలు కోల్పోయారు. మృతునికి భార్య పద్మ, కొడుకు రాకేష్, కూతుర్లు మౌనిక, ప్రియాంక ఉన్నారు. నేత పనితో రాజు ముగ్గురు పిల్లలు గల కుటుంబాన్ని పోషించుకుంటుండగా ఇటీవల చేతి నిండా పని లేక చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. కుటుంబ పెద్ద ఆత్మహత్యతో కన్నీరుమున్నీరుగా విలపించారు కుటుంబ సభ్యులు

## ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు హతం



**హైదరాబాద్ పెన్ పవర్:**బీజాపూర్-దంతెవాడ జిల్లాల సరిహద్దు అటవీప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో మూడు మావోయిస్టుల మృతదేహాలను భద్రతాబలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

ఘటనస్థలం వద్ద ఒక 303 రైఫైల్,12 బోర్ రైఫైల్, మందుగుండు సామగ్రి, ఇతర ఆయుధాలు,నిత్యావసర వస్తువుల స్వాధీనం చేసుకున్నారు.

ఎదురుకాల్పుల్లో 25లక్షల రివార్డ్ ఉన్న సుధీర్ ఏసుధాకర్ ఏమురళి కూడా మృతి చెందాడు. సుధీర్‌ఏ సుధాకర్ ఏమురళిపై 25 లక్షల రివార్డ్ ఉంది. స్వస్థలం తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా. మిగతా ఇద్దరినీ గుర్తించాల్సి ఉందని,సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని పోలీసులు వెల్లడిస్తున్నారు.

## తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ దాదాపు ఖరారు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆశలపల్లకిలో దాదాపు 25 మంది ఎమ్మెల్యేలు పరిశీలనలో నలుగురి పేర్లు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వాకిటి శ్రీహరి,గడ్డం వివేక్, సుదర్శన్ రెడ్డిల పేర్లు దాదాపు ఖరారు. మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావులను తొలగించి విజయశాంతికి, ప్రేమ్ సాగర్ రావులకు అవకాశం ఇస్తారంటూ జోరుగా ప్రచారం. మరో రెండు మంత్రి పదవులను హైదరాబాద్,రంగారెడ్డి జిల్లాల కింద ఒకరికి మైనారిటీ,ఎస్టీ కోటా కింద పెండింగ్ పెట్టనున్నట్లు సమాచారం.

## 3న శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కళ్యాణ రథోత్సవ వేడుకలు

**హైదరాబాద్ పెన్ పవర్:**తుగ్గలి మండల పరిధిలోని గల ఎద్దులదొడ్డి గ్రామం నందు మార్చి 3న శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కళ్యాణ రథోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలియజేశారు. గురువారం తెల్లవారుజామున పంచభూతాల సాక్షిగా వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు అశేష జన వాహిని మధ్య శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలియజేశారు.

# భారత్‌పై మరోసారి నోరు పారేసుకున్న కెనడా



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్‌పై కెనడా మరోసారి నోరు పారేసుకుంది. ఆ దేశంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకునే అవకాశం ఉందని ఆ దేశ స్పై ఏజెన్సీ ఆరోపించింది. భారత్‌తోపాటు చైనా, రష్యా, పాకిస్థాన్ దేశాలు కూడా ఆ ప్రయత్నం చేయొచ్చన్న అనుమానాలు వ్యక్తం చేసింది. కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ డిప్యూటీ డైరెక్టర్ వానెస్సా లాయిడ్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.'త్వరలో మా దేశంలో జరగబోయే ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకునేందుకు పీఆర్‌సీ (పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా) ఏఐ ఆధారిత సాధనాలను ఉపయోగించే అవకాశం ఉందని మాకు సమాచారం ఉంది. ఈ ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకునే ఉద్దేశం, సామర్థ్యం భారత ప్రభుత్వానికి కూడా ఉందని మేం భావిస్తున్నాం. రష్యా, పాకిస్థాన్ దేశాల కూడా ఆ ప్రయత్నాలు చేయొచ్చు' అని లాయిడ్ ఆరోపించారు.కాగా.. గతంలో కెనడా ఇలాంటి ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. 2019, 2021లో జరిగిన ఎన్నికల్లో భారత్, పాకిస్థాన్ దేశాలు జోక్యం చేసుకున్నట్లు కెనడా సెక్యూటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ ఆరోపణ చేసింది. ఈ ఆరోపణలపై ఆ దేశం దర్యాప్తునకు ఆదేశించింది. ఈ దర్యాప్తులో భారత్ జోక్యం చేసుకోలేదని తేలింది. కెనడా ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకోలేదని, ప్రధాని జస్టిస్ ట్రూడో విజయంలో ఆ దేశ పాత్ర ఏమీ లేదని కెనడా విచారణాధికారులు వెల్లడించారు. 2021లో జరిగిన జాతీయ ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకోలేదని గుర్తించామని కెనడా సీనియర్ అధికారుల బృందం పేర్కొన్నది. అయితే గత రెండు ఎన్నికల్లో చైనా జోక్యం చేసుకున్నట్లు గుర్తించామని కెనడా ఇంటెలిజెన్స్ ఏజెన్సీ తెలిపింది. మరోవైపు కెనడా ఎన్నికల్లో జోక్యం చేసుకున్నట్లు గతంలో వచ్చిన ఆరోపణలను ఇండియా అప్పట్లోనే కొట్టిపారేసింది. ఇతర ప్రజాస్వామ్య దేశాల వ్యవహారంలో జోక్యం చేసుకోబోమని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇప్పుడు మరోసారి భారత్‌పై ఒట్టావా అలాంటి ఆరోపణలే చేయడం గమనార్హం.

# భారత రాజ్యాంగం ప్రతీ పౌరుడికీ తన అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛ ఇచ్చింది

### కానీ దానికి ఒక పరిమితి ఉంటుంది.. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే



**హైదరాబాద్ పెన్ పవర్:**మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే పై స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆదివారం జరిగిన కామెడీ షోలో కమ్రా మాట్లాడుతూ.. థాణే నుంచి వచ్చిన ఓ నాయకుడు.. బీజేపీతో చేతులు కలిపి శివసేనను చీల్చేశాడని, అతడు దేశద్రోహి అని వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు మహా రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై ఏక్‌నాథ్ షిండే తొలిసారి స్పందించారు. కమెడియన్ వేసిన సెటైర్ తనకు అర్థమైందని, అయితే దేనికైనా పరిమితి ఉండాలని వ్యాఖ్యానించారు. బీబీసీ మరాఠీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో షిండే మాట్లాడుతూ.. 'ప్రతీ వ్యక్తి ఒక నిర్దిష్ట స్థాయిని కొనసాగించాలి. లేదంటే చర్య ప్రతిచర్యకు కారణమవుతుంది. భారత రాజ్యాంగం ప్రతీ పౌరుడికీ తన అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛ (ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్) ఇచ్చింది. కానీ దానికి ఒక పరిమితి ఉంటుంది. నాపై ఇలాంటి సెటైర్లు వేయడానికి కమ్రా సుపారి తీసుకున్నట్లు ఉంది' అని షిండే వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ ముఖ్యమని.. కానీ వేరే వారి తరఫున ఇతరుల గురించి ఇలా తప్పుగా మాట్లాడటం సరికాదన్నారు.

# సురేఖను తప్పించి విజయశాంతి కి

# కాంగ్రెస్‌లో సంచలనం..?

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణలో క్యాబినెట్ విస్తరణలో భాగంగా కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేబినెట్ విస్తరణపై ఇప్పటికే కసరత్తు చేస్తున్న హై కమాండ్.

సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం భట్టిలతో చర్చలు జరిగింది. సుదీర్ఘ చర్చల తరువాత కొత్తగా నలుగురు ఎమ్మెల్యేకు మంత్రి పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్, విజయశాంతి, సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్ రావు, వాకిటి శ్రీహరి పేర్లను హై కమాండ్ దాదాపు ఖరారు చేసింది. ఇందులో నలుగురు వ్యక్తులకు మంత్రి పదవి, ఇద్దరు వ్యక్తులకు డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ పదవులు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.

ఈ లిస్ట్‌లో రాజగోపాల్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి పేర్లు మంత్రులుగా దాదాపు ఖరారయ్యాయి. ఇక





ఇప్పటికే ఉన్న మంత్రి వర్గం నుంచి ఇద్దరు మంత్రులకు ఉద్వాసక కల్పించే యోచనలో కాంగ్రెస్ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ లిస్ట్‌లో మంత్రి కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు పేర్లు ప్రముఖంగా వినిస్తున్నాయి. వీళ్లిద్దరినీ మంత్రి పదవి నుంచి తొలగించి వీళ్ల స్థానంలో కొత్త మంత్రులను నియమించబోతున్నారని టాక్. ఉగాది పూర్తైన తరువాత వీళ్లలో ఎవరెవరికి ఏ మంత్రిత్వశాఖ ఇవ్వబోతున్నారు అనేది ఫైనల్ చేయబోతోంది కాంగ్రెస్.

# ఇకపై లైసెన్సులు రద్దు



**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఇకనుండి కఠిన చర్యలు తీసుకోకున్నట్టు పేర్కొన్నారు. పదే పదే ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయనున్నట్టు మంత్రి ప్రకటించారు. ఆ తర్వాత వాటిని ఏన్నటికీ పునరుద్ధరించమని, వారు తరువాత ఏవైనా వాహనాలు తీసుకుంటే వాటికి రిజిస్ట్రేషన్లు చేయమని హెచ్చరించారు. త్వరలోనే ప్రభుత్వం ఈ నిబంధనను అమలులోకి తీసుకు వస్తుందని, ఇందుకు సంబంధించి జీవో విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు. మంత్రి పేర్కొన్న ఈ నిర్ణయంతో నిబంధనల పట్ల నిర్లక్ష్యంగా వహించే వారికి భారీ షాక్ తగలనుంది. ఎనిసార్లు జరిమానాలు విధించినా కొందరు తీరు మార్చుకోవడం లేదని, అలాంటి వారిపట్ల ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పడం లేదని అధికారులు చెబుతున్నారు.

# ఆశించిన ఫలితం లేకపోవడంతో అసంతృప్తి ఉంది...

**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ సీనియర్ నేత ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆశించిన ఫలితం లేకపోవడంతో అసంతృప్తి ఉందని, అసంతృప్తి ఉన్నంత మాత్రాన ప్రజా జీవితానికి దూరం కానని స్పష్టం చేశారు.జగిత్యాల లో మీడియాతో మాట్లాడిన జీవన్ రెడ్డి ప్రజా జీవితంలో ఉంటా... ప్రజల కోసమే పని చేస్తానని తెలిపారు. నాలుగు దశాబ్దాల ప్రజాజీవిత అనుభవం ఉందని, ప్రజల శ్రేయస్సు కోసం సేవ చేస్తూనే ఉంటానని చెప్పారు. నర్సింగపూర్ పరిదిలోని 437, 251 సర్వే నంబర్ లలో 90 ఎకరాల ప్రభుత్వ భూమిని అనర్హులు పట్టాలు పొందారని అక్రమ భూ పట్టాలపై ఇన్చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఫిర్యాదు చేయడంతో పట్టాలను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. రాబోయే కాలంలో నర్సింగాపూర్ ప్రజల అవసరాలకు ఆ భూమిని వినియోగించాలని కోరారు. ప్రభుత్వ భూమి అక్రమంగా పట్టాలు పొందడం వెనుక ఎవరున్నా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎవరినో ఉద్దేశించి మాట్లాడడం లేదని, తప్పు చేసిన వారిపై చర్యలు ఉండాలన్నారు.



## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన...




**హైదరాబాద్ పెన్ పవర్:**డుంబ్రిగుడ మండలంలోని గుంట గన్నెల పంచాయతీ కేంద్రంలో మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె. కృష్ణకుమారి ఆధ్వర్యంలో విశాఖపట్నం ఎల్వి ప్రసాద్ ఐ హాస్పిటల్ ద్వారా నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 150 మంది గిరిజనులు పాల్గొన్నారు. దీంతో వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో పాల్గొన్న గిరిజనులకు ఎల్వి ప్రసాద్ ఐ హాస్పిటల్, వైద్య అధికారులు వైద్య పరీక్షలు నిర్వహించి మందు మాకులు పంపిణీ చేశారు. వీరిలో 15 మంది బాధితులకు కంటి చూపు ఆపరేషన్ పడుతుందని వైద్యులు అన్నారు. మరో 7 గురు బాధితులకు కళ్ళజోళ్ళు అవసరమని వైద్యులు చెప్పారు. కంటి చూపుతో బాధపడే 15 మంది బాధితులకు ఉచితంగానే కంటి చూపు ఆపరేషన్ నిర్వహించి మిగతా 7 ఏడుగురుకు ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ వైద్య సిబ్బంది గోపాల్, రాజ్ దీప్, వై సత్యనారాయణ, భూపతి , గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్స్ ఆధ్వర్యంలో తమ్మినపట్నం, లింగవరంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

### వరగలి పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ గీతామణి

**హైదరాబాద్ పెన్ పవర్:**తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో మంగళవారం చిల్లకూరు మండలం వరగలి పిహెచ్ సి పరిధిలోని తమ్మినపట్నం, లింగవరం గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారి డాక్టర్ గీతామణి తెలిపారు. పింక్ బస్సుల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. బిపి, షుగరు పరీక్షలతోపాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. కాగా, మార్చి 27న వరగలి పిహెచ్ సి పరిధిలో మోమిడి, చిట్టేడు పిహెచ్ సి పరిధిలోని కోట-1 ప్రాంతాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారు.ఈ కార్యక్రమాల్లో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ చైతన్య భాను, సర్పంచ్ ఎన్.సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి డి.రమణయ్య, హెల్త్ సూపర్వైజర్ పద్మావతి, ఎంఎల్ హెచ్ పిలు ఐ.శోభ, ఏఎన్ఎంలు శ్రీకావ్య, శాంతకుమారి, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భార్యను నరికి చంపిన భర్త రైలు కిందపడి ఆత్మహత్య

**హైదరాబాద్ పెన్ పవర్:**వల్లూరు మండలం అంబవరం ఎస్సీ కాలనీలో భర్త చేతిలో భార్య మృతి చెందింది. భార్యను భర్త యర్రగుడి పాడు చెన్నకేశవ విచక్షణ రహితంగా కత్తితో నరికాడు. భార్య సుజాత అక్కడికక్కడే మృతి చెందింది. గత రెండు రోజుల నుండి భార్యాభర్తల మధ్య గొడవ జరుగుతున్నట్లు స్థానికుల సమాచారం. సంఘటన స్థలానికి చేరుకున్న కమలాపురం సిఐ ఎస్.కె రోషన్ విచారణ చేస్తున్నారు. భార్యను చంపిన భర్త ఎర్రగుడిపాడు చెన్నకేశవ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

## 14 ఏళ్లుగా పెండింగ్‌లోనే ఘట్కేసర్ ఫ్లై ఓవర్ ఎట్టకేలకు నిధులు మంజూరు



**హైదరాబాద్ పెన్ పవర్:**గత 14 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఘట్కేసర్ ఫ్లై ఓవర్ పనులు ఇకపై శరవేగంగా ముందుకు సాగనున్నాయి. అయితే, మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 14 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ పనులను ప్రారంభించాలని డిప్యూటీ సీఎంకు మాజీ మంత్రి మల్లారెడ్డి వినతిపత్రం సమర్పించారు. అయితే, మల్లారెడ్డి వినతిపై వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పనులు ప్రారంభించేందుకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేశారు దీంతో మేడ్చల్ నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఎంఫార్మసీ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఫార్మసీ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను సంబంధిత కళాశాలల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని చెప్పారు. ఈ రివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 29వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ. 200 అపరాధ రుసుముతో వచ్చే నెల 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 29వ తేదీ వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్లో చూసుకోవచ్చని సూచించారు.

### పదవ తరగతి పరీక్షల కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన

# జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**హైదరాబాద్ పెన్ పవర్:**పదవ తరగతి పరీక్షల కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కరీంనగర్ ముకారాంపురం లోని ప్రభుత్వ పురాతన పాఠశాల, వాణినికేతన్ పాఠశాల, మంకమ్మతోట లోని ధన్గర్ వాడి ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్ష జరుగుతున్న సరళిని పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో కల్పించిన మౌళిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసుకు అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచీలు, కాలిక్యులేటర్లు అనుమతించొద్దని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులతో పాటు, సిబ్బందిని నిశిత పరిశీలన అనంతరమే అనుమతించాలని తెలిపారు. పరీక్షా పత్రాలు, జవాబు పత్రాల రవాణా పోలీస్ ఎస్కార్ట్ తో చేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ అన్నారు.

## తెలంగాణ బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కొరకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి:

**హైదరాబాద్ పెన్ పవర్::**తెలంగాణ బీసీ బిల్లుకు అఖిలపక్ష మద్దతు కోసం భవిష్యత్ కార్యాచరణరాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేసే బాధ్యత మీది ఉద్యమించే బాధ్యత మాది, గుజ్జ సత్యంతెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని చేసిన తీర్మానం పార్లమెంటులో ఆమోదం పొందేలా భవిష్యత్ కార్యాచరణ కోసం కాచిగూడ లోని అభినందన్ గ్రాండ్ లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన మీడియా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ వడ్డేపల్లి హనుమంతు, మరియు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## బీసీ వీరుల నాయకుల చరిత్ర బయటకు తీయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**బేగంపేట్ లోని హోటల్ టూరిజం ప్లాజా లో జరిగిన బీసీ కోర్ కమిటీ మీట్ కార్యక్రమలో బీసీ ఉద్యమ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. బీసీ జేఏసీ చీఫ్ కో ఆర్డినేటర్ గా సూదగాని హరిశంకర్ గౌడ్ ఎన్నికయ్యారు.

తీన్మార్ మల్లన్న మాట్లాడుతూన్యూస్ పేపర్ లల్లో సగం పేజీ బీసీలది అయినప్పుడు రాజ్యాధికారం వస్తది. అందరిని కలుపుకొని పోవాలి. మండలిలో బీసీ ల గురించి మాట్లాసుతుంటే బీసీ సభ్యులు వెళ్లిపోయారు. ఓసి లు అభినందించారు. కానీ వాళ్ళ లోపల ఉండేది వేరు. జేయన్ టియు ప్రొఫెసర్ కు అన్యాయం జరిగింది వీసీ తో మాట్లాడితే ఫోన్ ఎత్తలే. ప్రసన్న హరికృష్ణ కు మద్దత్తు తెలిపితే సస్పెండ్ చేశారు. బీసీ ల కోసం కమిట్మెంట్ తో వచ్చిన. నా పిల్లలమీద ఒట్టు. మనమీద ఉన్న ప్రేమ ఓటుగా మారినప్పుడే ఫలితం ఉంటుంది. ఉద్యమాన్ని నిలబెట్టాలంటే పరిక్కంప ను కూడా కౌగిలించుకోవడానికి సిద్ధం. స్టేట్ చీఫ్ కో ఆర్డినేటర్ అయిన సూదగాని హరిశంకర్ గౌడ్ తెల్లప్పుడూ టైమ్ ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలి. అందరు సిద్ధంగా ఉండాలి. తెలంగాణ జాతిపిత జయశంకర్ సార్ ఇదే ఫైనల్. బీసీ వీరుల నాయకుల చరిత్ర బయటకు తీయాలి. జిల్లాల కమిటీలు కూడా బలోపేతం చేయాలి. యూ ట్యూబ్ ఛానెల్ లకు వెళ్లి మాట్లాడండి. బీసీ వాదం బలపడాలి. మీడియాలో రోజు ఉండాలి. రేవంత్ రెడ్డి ఫోటో వేసి బీసీ రాజ్యాధికారం అని కొంతమంది సభ పెడుతున్నారు. అది మానుకోవాలి. సోషల్ మీడియాను విసతృతంగా వాడుకోవాలి. హరిశంకర్ గౌడ్ కు అందరు సహకరించాలి. ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పంజాల జైహింద్ గౌడ్ నవ సంఘర్షణ సమితి అల్ ఇండియా చైర్మన్,వి. ప్రకాష్, వట్టె జానయ్య యాదవ్, సంగెం సూర్యారావు, మాజీ ఎమ్ బీసీ కమిషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ ప్రజపతి, కొడెపాక కుమారస్వామి, తెలంగాణ విఠల్, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ భాగయ్య, పొఫెసర్ శ్రీనివాస్, పంజాల శ్రవణ్ కుమార్ గౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న సేన ప్రెసిడెంట్,ప్రొఫెసర్ వెంకట రాజయ్య, ప్రసన్న హరికృష్ణ,, తమ్మడబోయిన అర్జున్, సయ్యద్ రఫీ, చెన్నోజు రవి కిరణ్, పర్వతం వెంకటేశ్వర్లు, తిరుమని నాగరాజు, వేములవాడ మధన్ మోహన చారి, ఎల్లబోయిన ఓదెలు యాదవ్, సుతారపు రంగన్న, బంధారపు నర్సయ్య గౌడ్, సిద్ధగౌని సుదర్శన్, బడే సాబ్, మల్లిఖార్జున్, గోపి రజక, డాక్టర్ సాంబ శివ గౌడ్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, రాఘవేంద్ర గౌడ్, రిటైర్డ్ డీఈఓ విజయ్ కుమార్,కోట్ల వాసుదేవ్, సింగారపు రవీందర్, బీ శంకర్ ఆరె కటిక, ప్రొఫెసర్ దేవల్ల సమ్మయ్య, శంకర్ పల్లి మధు, డీఎస్ చారి, భూసారపు శ్రీనివాస్, వడ్డేపల్లి మాధవ్ మేరు, వెంకటరమణ, నాగరాజు గౌడ్, వివిధ కుల సంఘాల నాయకులు, మేధావులు, తదితరులు పాల్గొన్నారు.